
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.6 | కనిష్ఠం 24.5



నేడు నీటి విడుదలపై రైతులతో సమావేశం

నాగిరెడ్డిపేట, ఆగస్టు 11 : ప్రస్తుత ఖరీఫ్ పంటల సాగు కోసం పోచారం ప్రాజెక్టు నీటి విడుదలపై ఆయకట్టు రైతులతో చర్చించేందుకు సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎల్లారెడ్డి ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోచారం ప్రాజెక్టు నీటి మట్టం 16 అడుగులకు చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 1.820 టీఎంసీలకు గాను 1.143 టీఎంసీల నీరు వచ్చి చేరింది. దీంతో ప్రాజెక్టు నీటి విడుదల కోసం రైతులతో చర్చించి నిర్ణయం తీసుకునేందుకు నాగిరెడ్డిపేట ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.



నామినేటెడ్ పదవులపై.. ఆశలు!



- త్వరలో ఆలయ, మార్కెట్ కమిటీల ఏర్పాటు
- ఈ నెలలో మరిన్ని పోస్టుల భర్తీకి కసరత్తు
- జిల్లాస్థాయి పదవులకు తీవ్ర పోటీ
- ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకుంటున్న ఆశావహులు
- పని చేసే వారికే అవకాశం అంటున్న అధిష్ఠానం
- స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పదవుల భర్తీ

కామారెడ్డి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ కాంగ్రెస్‌లో నామినేటెడ్ పోస్టులపై నేతలు ఆశలు పెట్టుకుంటున్నారు. జిల్లా, మండల స్థాయిలోని మార్కెట్, ఆలయ కమిటీలతో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ కమిటీలు ఖాళీగా ఉన్నందున ఆ పదవులను దక్కించుకునేందుకు కాంగ్రెస్‌లోని పలువురు నేతల మధ్య పోటీ నెలకొంటుంది. అయితే త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఆ లోపే నామినేటెడ్ పదవులను కేటాయించే పనిలో కాంగ్రెస్ అధిష్ఠానం ఉన్నట్లు తెలుస్తోంది. పంచాయతీ ఎన్నికలే లక్ష్యంగా నామినేట్ పదవుల భర్తీకి ఆ పార్టీ అధిష్ఠానం కసరత్తు చేస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కొందరు నేతలు నామినేటెడ్ పదవుల కోసం ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకుంటున్నారు. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కష్టపడిన వారంతా నామినేట్ పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లో చాలా మంది ముఖ్య నేతలు ఉన్నారు. వీరంతా నామినేట్ పదవులను ఆశీస్తున్నారు.

మార్కెట్, దేవాదాయ పదవులకు పోటీ

దశాబ్ద కాలంగా అధికారంలో లేక పదవులు పొందలేక, పనులు చేయలేక అవస్థలు పడ్డ కాంగ్రెస్ పార్టీలోని ద్వితీయశ్రేణి నేతలు జిల్లా, మండల స్థాయి నామినేట్ పోస్టులు ఆశలు రేకెత్తిస్తున్నాయి. కాంగ్రెస్ అధిష్ఠానం ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నేతలను జిల్లా, నియోజకవర్గ స్థాయిలో వివిధ సంస్థల్లో నామినేట్ చేసేందుకు చర్యలు చేపట్టింది. ప్రధానంగా జిల్లాలోని మార్కెట్ కమిటీ, దేవాదాయ కమిటీలపై ఆశావహులు కన్నేశారు. ఈ పదవులకు కాంగ్రెస్ ముఖ్యనేతల మధ్య పోటీ నెలకొంటుంది. జిల్లాలో 10 మార్కెట్ కమిటీలు ఉన్నాయి. మార్కెట్ కమిటీల పదవుల కోసం ఆశావహులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో దానిలో చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు 12మంది డైరెక్టర్‌లను నియమించాల్సి ఉంటుంది. అంటే ఒక్కో మార్కెట్ కమిటీలో 14 మందికి అవకాశం దక్కనుంది. కామారెడ్డి నియోజకవర్గంలో కామారెడ్డి, భిక్కనూర్ మార్కెట్ కమిటీలు ఉండగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో సదాశివనగర్, గాంధారి, ఎల్లారెడ్డి, బాన్సువాడ నియోజకవర్గాల్లో బాన్సువాడ, బీర్కూర్, జుక్కల్ నియోజకవర్గంలో పిట్లం, మద్నూర్, బిచ్కుంద మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఈ మార్కెట్ కమిటీల్లో పదవులను భర్తీచేస్తే కాంగ్రెస్‌లోని వంద మందికి పైగా పదవులు పొందే అవకాశం ఉంది. వీటితో పాటు జిల్లాలోని పలు ఆలయ కమిటీలను నామినేట్ చేయనున్నారు. చైర్మన్‌తో పాటు డైరెక్టర్‌లు ఉంటారు.

గ్రంథాలయ చైర్మన్‌కు పోటీ

జిల్లాలో నామినేట్ పదవులలో ముఖ్యమైనది జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్. ఈ పదవికి తీవ్ర పోటీ నెలకొంటుంది. కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల నుంచి పలువురు కాంగ్రెస్ నేతలు గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. అయితే గతంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవిని కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలకు చెందిన వారు పదవి పొందారు. ఈ నేపథ్యంలో ఈసారి జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గానికి గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి ఇవ్వాలని డిమాండ్ వస్తున్నట్లు తెలుస్తోంది. అయితే బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన కాసుల బాలరాజ్‌కు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవిని కాంగ్రెస్ అధిష్ఠానం కట్టబెట్టింది. ఈ నేపథ్యంలో జుక్కల్ నియోజకవర్గం నుంచి గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ను నియమించాలనే డిమాండ్ ఉన్నట్లు ఆ పార్టీ వర్గాల్లో చర్చసాగుతోంది. జుక్కల్ నియోజకవర్గానికి చెందిన వారికే గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి దక్కే అవకాశం ఉంటుందని ఆ పార్టీ వర్గాలు సైతం చెబుతున్నాయి. గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవితో పాటు పాలకవర్గంలోని డైరెక్టర్‌ల నియామకం సైతం చేపడుతారు. ఎవరికి ఈ పదవులు దక్కుతాయో వేచి చూడాలి.

స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యం

రానున్న రోజుల్లో పంచాయతీ, మున్సిపల్, జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను గెలిపించుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ అధిష్ఠానం నామినేట్ పదవుల భర్తీకి కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ కోసం పాటుపడిన వారికి నామినేట్ పదవులు కట్టబెట్టి ఈ ఎన్నికల్లో వారి సేవలను వినియోగించుకోవాలని పార్టీ భావిస్తోంది. జిల్లా స్థాయిలో గ్రంథాలయ సంస్థ, మార్కెట్ కమిటీలు, ఆలయ కమిటీలు, రైతు సమన్వయ కమిటీలు, ఆత్మ కమిటీల చైర్మన్, డైరెక్టర్ పోస్టులు ఉన్నాయి. జిల్లాలో ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలుగా మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతారావులు కొనసాగుతున్నారు. బాన్సువాడలో బీఆర్ఎస్ గెలుపొందిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల కాంగ్రెస్ గూటికి చేరారు. కామారెడ్డిలో ముఖ్యనేతగా ఉన్న షబ్బీర్‌అలీ క్యాబినెట్ హోదాలో కొనసాగుతున్నారు. వీరి నేతృత్వంలోనే ఆయా నియోజకవర్గాల్లో జిల్లా, మండల స్థాయి నామినేట్ పదవులను భర్తీ చేసే అవకాశాలు ఉన్నాయి.

ఆశావహుల ముమ్మర ప్రయత్నాలు

నామినేట్ పదవులు ఎవరికి ఇవ్వాలనే అంశం స్థానిక ఎమ్మెల్యే పరిధిలో ఉండడంతో వారిని ప్రసన్నం చేసుకునేందుకు ఆశావహులు ముమ్మరంగా ప్రయత్నం చేస్తున్నారు. నిత్యం ఎమ్మెల్యేలకు టచ్‌లో ఉంటూ తమ కోరికలను వారికి వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలో తమను ఎమ్మెల్యేగా గెలిపించడంలో కృషి చేసిన వారికి, తొమ్మిదేళ్లుగా పార్టీని నమ్ముకుని గత ప్రభుత్వంపై పోరాడిన వారికే నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించే యోచనలో ఎమ్మెల్యేలు ఉన్నట్లు తెలుస్తోంది.

జిల్లాలో 70 శాతమే వరి నాట్లు

- 30 శాతం ఎప్పటికీ పూర్తయ్యేనో?
- బోర్ల సహాయంతోనే పంటల సాగు
- ప్రాజెక్టుల ద్వారా సాగు నీరు అందేనా?
- అయోమయంలో అన్నదాతలు



నాగిరెడ్డిపేటలో బోర్ల సహాయంతో వరి నాట్లు వేసిన రైతులు

నాగిరెడ్డిపేట, ఆగస్టు 11: ప్రస్తుత వర్షాకాలంలో జిల్లాలో భారీ వర్షాలు కురవకపోవడంతో, ప్రాజెక్టులు, చెరువులు కుంటలు, నిండకపోవడంతో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో ఇప్పటి వరకు 70 శాతం మాత్రమే వరి నాట్లు వేయడం పూర్తయింది. ఇంకా జిల్లాలో సుమారు 30శాతం వరకు రైతులు వరి నాట్లు వేయలేదు. సాగు నీటి సౌకర్యం లేకపోవడం కారణంగానే రైతులు వరి నాట్లు ఇంకా వేసుకోలేదు. వరి నాట్ల కోసం వేసుకున్న వరి నారుమళ్లలో ముదురుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో బోరు బావుల నీటి సహాయంతో పంటలు సాగు చేసే చాలా మంది రైతులు వరి నాట్లు వేయగా, ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షాల మూలంగా ప్రాజెక్టులోకి కొంత మేర నీరు వచ్చి చేరింది. వర్షాలతో చెరువులు, కుంటల్లో వచ్చిన నీటి ఆధారంగా కొందరు రైతులు వరి నాట్లు వేసుకున్నారు. జిల్లాలో ఇంకా 30 శాతం రైతులు వరి నాట్లు వేయాల్సి ఉంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో ఐదు లక్షల 20 వేల ఎకరాల్లో వివిధ పంటల సాగు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు మూడు లక్షల 70వేల 79 ఎకరాలలో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేశారు. అలాగే ప్రస్తుత ఖరీఫ్‌లో జిల్లాలో మూడు లక్షల 12 వేల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు రెండు లక్షల 973 ఎకరాల్లో వరి నాట్లు వేయడం పూర్తయింది. ఇంకా లక్ష ఎకరాలకు పైగా రైతులు వరి నాట్లు వేయాల్సి ఉంది. వరి నాట్లు వేయని కారణంగా సాగు భూములు కొన్ని బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి. వర్షాలు అనుకూలిస్తే ఈ నెలాఖరు వరకు జిల్లాలో వరి నాట్ల లక్ష్యం పూర్తయ్యే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

పోచారం నీటి విడుదల కోసం ఎదురు చూస్తున్నరైతులు

ప్రస్తుత ఖరీఫ్ పంట సాగు కోసం పోచారం ప్రాజెక్టు నీటి విడుదల కోసం ఆయకట్టు రైతులు ఎదురు చూస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పోచారం ప్రాజెక్టులో 15 అడుగుల నీరు వచ్చి చేరింది. పోచారం ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 20.5 అడుగులు (1.820 టీఎంసీలు) కాగా, ఇటీవల కురిసిన వర్షాల వల్ల ప్రాజెక్టులో 15 అడుగులు (1.105 టీఎంసీలు) నీరు వచ్చి చేరింది. ఇంకా 5.5. అడుగుల నీరు వచ్చి చేరితే ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండుతోంది. ప్రాజెక్టులోని ఇన్‌ఫ్లో 593 క్యూసెక్కులు మాత్రమే వస్తోంది. ఖరీఫ్ పంటల సాగు కోసం ప్రతీ సారి పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా ఆగస్టు 15న నీటి పారుదల శాఖ అధికారులు నీటిని విడుదల చేస్తారు. గతంలో ప్రాజెక్టులో 15 అడుగుల నీరు ఉన్నప్పుడు సైతం పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా ఖరీఫ్‌సాగు కోసం నీటిని విడుదల చేసినట్లు ఆయకట్టు రైతులు అంటున్నారు. ప్రస్తుతం పోచారం ప్రాజెక్టు ఆయకట్టు రైతులు చాలా వరకు బోర్ల సహాయంతో వరి నాట్లు వేసుకుని నీటి విడుదల కోసం ఎదురు చూస్తుండగా, మరికొందరు రైతులు ఇప్పటి వరకు వరి నాట్లు వేసుకోక ప్రాజెక్టు నీరు విడుదల చేస్తే నాట్లు వేసుకుంటామని నీటి విడుదల కోసం ఎదురు చూస్తున్నారు. పోచారం ప్రాజెక్టు ఆయకట్టు కింద అధికారికంగా 10.500 ఎకరాల భూములు ఉండగా, అనధికారిక లెక్కల ప్రకారం 17వేల ఎకరాల వరకు సాగు భూములకు ప్రాజెక్టు ద్వారా సాగు నీరు అందిస్తారు. ప్రాజెక్టు నీటి విడుదల కోసం ప్రతీ సారి నీటి పారుదల శాఖ అధికారులు ఆయకట్టు రైతులతో సమావేశం ఏర్పాటు చేసి రైతుల అభిప్రాయం మేరకు నీటిని విడుదల చేస్తారు. ఇప్పటి వరకు నీటి పారుదల శాఖ అధికారులు రైతులతో సమావేశం నిర్వహించనందున ఈసారి పంద్రాగస్టుకు నీటి విడుదల చేస్తారో లేదో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో మూడు లక్షల 70 వేల ఎకరాల్లో పంటల సాగు

- భాగ్యలక్ష్మీ, జిల్లా వ్యవసాయ అధికారి

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో ఐదు లక్షల 20 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేసే లక్ష్యం కాగా, ఇప్పటి వరకు మూడు లక్షల 70 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేసేందుకు లక్ష్యంగా ఉండగా, రెండు లక్షల 973 ఎకరాల్లో రైతులు ఇప్పటి వరకు వరి నాట్లు వేసుకున్నారు. ఈ నెలాఖరు వరకు జిల్లా లక్ష్యం పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం.

నీటి విడుదలపై త్వరలో సమావేశం నిర్వహిస్తాం

- వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ డీఈఈ, ఎల్లారెడ్డి

ఖరీఫ్ పంటల సాగు కోసం పోచారం ప్రాజెక్టు నీటి విడుదల విషయమై అతి త్వరలోనే ఆయకట్టు రైతులతో సమావేశం నిర్వహించనున్నాం. ప్రస్తుతం ప్రాజెక్టులో 1.820 టీఎంసీలకు గాను 1.105 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఆయకట్టు రైతులతో త్వరలోనే నాగిరెడ్డిపేటలో సమావేశం నిర్వహించి నీటి విడుదల విషయమై రైతులతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటాం.

పెంటకుప్పలపై మొరం వేసిన పంచాయతీ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బీర్కూర్‌లో మొరం వేసి చదును చేస్తున్న దృశ్యం

బీర్కూర్, ఆగస్టు 11: 'స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమానికి తూట్లు' అనే శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఈ మేరకు బీర్కూర్ గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది స్పందించారు. ఆదివారం బీర్కూర్ మండల కేంద్రంలోని పోచారం కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రం చుట్టూరా ఉన్న పెంటకుప్పలపై మొరం వేసి ట్రాక్టర్‌తో చదును చేశారు. ఎన్నో ఏళ్లుగా పెంట కుప్పల మధ్య అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతోంది. పలు మార్లు పిల్లల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది సంబంధిత అధికారులకు విన్నవించారు. అయినా అధికారులు ఎవరూ స్పదించలేదు. సమస్య పరిష్కారం కాలేదు. దీంతో 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించి, గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బందిలో కదలిక తెచ్చింది. పెంట కుప్పలపై మొరం వేసి చదును చేశారు. ఎట్టకేలకు సమస్య పరిష్కారం అయింది. పిల్లల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

16 అడుగులకు చేరిన పోచారం నీటి మట్టం



పోచారం ప్రాజెక్టులో ప్రస్తుత నీటి మట్టం

నాగిరెడ్డిపేట, ఆగస్టు 11: పోచారం ప్రాజెక్టు నీటిమట్టం 16 అడుగులకు చేరుకుంది. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా పోచారం ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టులో నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్టులో నీటి మట్టం పెరుగుతుండటంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పోచారం ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో లింగంపేట, గుండారం వాగుల ద్వారా ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టులో నీటి మట్టం రోజురోజుకూ పెరుగుతుంది. ఆదివారం వరకు ప్రాజెక్టులోకి 16 అడుగుల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 20.5 అడుగులు (1.820 టీఎంసీలు)కు గాను ప్రస్తుతం ప్రాజెక్టులో 16 అడుగులు (1.143 టీఎంసీలు) నీరు వచ్చి చేరింది. ఆదివారం ప్రాజెక్టులోకి 159 క్యూసెకులు ఇన్ ఫ్లో వస్తున్నట్లు ఎల్లారెడ్డి నీటి పారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

వసతులు లేక గురుకుల విద్యార్థుల అవస్థలు

పట్టణ శివారులోని పాత భవనంలో కొనసాగుతున్న పాఠశాల

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 11: పట్టణంలోని గ్రామశివారులో గల వేల్పూర్ సాంఘిక సంక్షేమ ఎస్సీ గురుకుల పాఠశాలలో విద్యార్థులు వసతులు లేక ప్రతీరోజు నానా అవస్థలకు గురవుతున్నారు. వేల్పూర్ మండల కేంద్రంలో ఉండాల్సిన ఎస్సీ గురుకుల బాలుర పాఠశాల సొంత భవనం లేక గత కొన్నేళ్లుగా ఆర్మూర్ శివారులో గల గురుకుల పాఠశాల పాత భవనంలో వేల్పూర్ గురుకుల పాఠశాల నడుస్తోంది. 90 శాతం సమస్యలతో విద్యార్థులు నరకయాతన పడుతున్నారు. ఇప్పటి వరకు గురుకుల పాఠశాలలో 452మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యబోధన జరుగుతున్న ఉదయం లేచిన నుంచి తెల్లరేవరకు విద్యార్థులు అవస్థలను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత కాలంలో డిజిటల్ క్లాస్‌లు నడుస్తున్న తరుణంలో వేల్పూర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు కూర్చోవడానికి కుర్చీలు లేక, పడుకోవడానికి బెడ్‌లు లేక అవస్థలు పడుతున్నారు. విద్యార్థులకు విద్యబోధన సమయంలో కూర్చోవడానికి బెంచీలు లేకపోవడంతో కింద కూర్చొని క్లాసులను వింటున్నారు. అలాగే కొన్ని క్లాస్‌రూంలకు తలుపులు, కిటికీలకు డోర్‌లు విరిగిపోయి ఉన్నాయి. వర్షాలు పడితే జల్లులు వస్తున్నాయని విద్యార్థులు దుప్పట్లను అడ్డుగా కట్టుకుంటున్నారు. విద్యాబోధన అనంతరం విద్యార్థులకు అదే రూంను పడుకోవడానికి ఉపయోగించుకుంటున్నారు. ఇటు చదువు కోసం క్లాస్‌రూంతో పాటు హాస్టల్‌గా అదే గదిని వాడుకుంటున్నారు. అలాగే వర్షాలు పడేటప్పుడు రేకుల షెడ్డులతో ఉన్న గురుకుల పాఠశాలలో కొన్ని రూంలలో రేకులు చెడిపోయి వర్షపు నీరు గదులలో పడుతుండడంతో విద్యార్థులు రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గదులల్లో విద్యుత్ సరఫరా సైతం సరిగా లేదు. అలాగే గదులలో ట్యూబ్‌లు, ఫ్యాన్‌లు సైతం లేవు. ప్రతీ క్లాస్‌రూంలో విద్యాబోధన కోసం ఏర్పాటు చేసిన బోర్డులు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఓ క్లాస్ రూంలో బోర్డును నిటారుగా పెట్టి ఉపాధ్యాయుడు బోధనను కొనసాగిస్తుండగా మిగతా క్లాసులలో శిథిలావస్థలో ఉన్న బోర్డులను వినియోగిస్తున్నారు. విద్యార్థులు ఉదయం కాలకృత్యాలు తీర్చుకుందామంటే బాత్ రూంలకు డోర్‌లు లేకపోవడం, ఉన్నవాటికి విరిగిపోయి ఉన్నాయి. రెండు గురుకుల పాఠశాలకు ఒక నీటి బోరు ఉండడంతో మిషన్ భగీరథ ద్వారా నీటిని వినియోగించు కుంటున్నారు. విద్యార్థులకు స్నానాల గదులు లేక నీటి ట్యాంకు వద్దనే పైప్ ద్వారా కొందరు. తాగునీటి నల్లాల వద్ద, మరి కొందరు విద్యార్థులు స్నానాలను చేస్తున్నారు. విద్యార్థులకు దాహం వేస్తే అదే నీటిని తాగాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు, నాయకులు చొరవ తీసుకొని వేల్పూర్ మండల కేంద్రంలో గురుకుల పాఠశాలను నిర్మించాలని లేదా మంచి అద్దె భవనంలోనైనా కొనసాగేలా అనుమతించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. అలాగే కొద్ది దూరంలో ప్రభుత్వ గిరిజన బాలుర కళాశాల వసతి గృహానికి కంపౌండ్‌వాల్ నిర్మాణం లేక విద్యార్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. గురుకుల పాఠశాలకు వెళ్లే మార్గం గుంతలమయం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సాంఘిక సంక్షేమ ఎస్సీ గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


వర్షపు నీరు రాకుండా కిటికీలకు అడ్డంగా పెట్టిన దుప్పటి


గురుకుల పాఠశాలలో తలుపులు లేని బాత్‌రూంలు

అప్రోచ్ రోడ్డు లేక గిరిజనల అవస్థలు

● వాగులపై మినీ వంతెనకు రెండు వైపులా అప్రోచ్ రోడ్లు లేకపోవడంతో ప్రమాదానికి గురవుతున్న తండా వాసులు



మీరీబాయి తండా వద్ద వంతెన వద్ద కోతకు గురైన అప్రోచ్ రోడ్డు

సిరికొండ ఆగస్టు 11:సిరికొండ మండలంలోని వర్జ్యన్‌తండా గ్రామ పంచాయతీ పరిధిలో గల వాగులపై మినీ వంతెనలకు రెండు వైపులా అప్రోచ్ రోడ్లను నిర్మించాలని గిరిజనులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.తూంపల్లి నుంచి వర్జ్యన్‌తండా, మీరీబాయి తండా మీదుగా సుభాష్ తండా, బాల్‌రాజ్‌నయాక్ తండా నుంచి పాకాల వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు వరకు రింగ్ రోడ్డు నిర్మాణానికి రూ. నాలుగు కోట్ల నిధులను గిరిజన కార్పొరేషన్ మూడేళ్ల క్రితం మంజూరు చేసింది. రోడ్డు నిర్మాణం వరజ్యన్‌తండా వరకు పూర్తి చేయించిన అధికారులు అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారనే దానితో పనులను నిలిపివేశారు.మీరీబాయి తండాకు సమీపాన గల వాగుపై ఒకటి, సుభాష్ తండాకు సమీపాన గల వాగుపై మినీవంతెనలు నిర్మించారు. వాస్తవానికి ఈరెండు వాగులపై పైపులతో కాకుండా వెంట్‌లు ఏర్పాటు చేసి కొంత హై లెవల్ వంతెనలు నిర్మిస్తే గిరిజన ప్రజల రాకపోకలకు సులవుగా ఉండేది, ప్రతీ ఏడాది వర్షాలు కురుస్తే చాలు రెండు మినీ వంతెనలకు రెండు వైపులా అప్రోచ్ రోడ్డు రోతకు గురవుతున్నాయి.సుభాష్ తండా వద్ద వంతెనపై నుంచి వరద నీళ్ల ప్రవహించడమే కాదు అటు ఇటురెండు వైపుల రోడ్డు కోతకు గురవుతుంది. పైపుల్లో చెత్త చెదారం తట్టుకుని వంతెన కొంత మేరకు డ్యామేజ్ అయ్యింది.రోడ్డు కోతకు గురవ్వడం వల్ల ప్రజలు ఎటు వైపు వెల్లడానికి వీలు కాకుండా ఉంటుంది.దీనివల్ల తండాల ప్రజలు తూంపల్లి గ్రామానికి రావాలన్న, గ్రామపంచాయతీకి రావాలన్నరాలేని ప్రరిస్థితి ఏర్పడుతుంది. కోతకు గురైన అప్రోచ్ రోడ్లను తండాకు చెందిన గిరిజనులే మట్టి పోసుకుని నడువడానికి అనుకూలంగా రోడ్డును తయారు చేసుకుంటున్నారు.హన్మానాయక్‌తండా నుంచి మీరాబాయితండా మీదుగాసు భాష్‌తండా వరకురోడ్డంతా బురద గుంతలుగా మారుతుంది.వర్షాలు తగ్గుతేనే వారు సుభిక్షంగా నడువగులుగుతారు.గిరిజన ప్రజల పరిస్థితులను అర్ధం చేసుకుని పాలకులు రోడ్డును బాగు చేయడంతో పాటు ఆగిపోయిన తారురోడ్డు నిర్మాణపనులను ప్రారంభించాలని గిరిజనుల కోరుతున్నారు.రెండువాగులపై వంతెనల ఎత్తుపెంచక పోవడంతో రాక పోకలకు ఇబ్బందులు కలిగాయి. ఎత్తు పెంచి నిర్మాంచాలని సుభాష్ తండా,మీరీబాయి తండా ప్రజలు ప్రభుత్వాన్నిస్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని కోరుతున్నారు.



సుభాష్ తండా సమీపాన మినీ వంతెన

ప్రమాదకరంగా మారిన జన్నేపల్లి వాగు బ్రిడ్జి రోడ్డు



గుంతలమయంగా మారిన రోడ్డు

నవీపేట,ఆగస్టు11: మండలంలోని జన్నేపల్లి వాగుపైన ఉన్న బ్రిడ్జి రోడ్డు ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జన్నేపల్లి నుండి నందిపేట మండలానికి వెళ్లడానికి ఈ బ్రిడ్జి ప్రధాన వారధిగా ఉంది. జన్నేపల్లి వైపు ఉన్న బ్రిడ్జి రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడగా సంవత్సరం క్రితం రోడ్డుకు ఒక వైపున కొద్దిదూరం వరకు సీసీ రోడ్డును వేశారు. రెండవ వైపున సైతం బ్రిడ్జిపై సీసీ రోడ్డు వేయాల్సి ఉండగా సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు మధ్యలోనే నిలిపివేశారు. దీంతో బ్రిడ్జిపైన ఉన్న రోడ్డుపై వాహనాలు ఒకే వైపున ప్రయాణిస్తుండడంతో తరుచుగా ప్రమాదాలు జరుగతున్నాయి. బ్రిడ్జిపైన రెండవ వైపున సీసీ రోడ్డు వేయకపోవడంతో ఇనుక చువ్వలు బయట తేలడంతో ద్విచక్ర వాహనదారులతో పాటు పాదచారులు గాయాలపాలవుతున్నారు. ఈ విషయంపై వెంటనే ఉన్నతాధికారులు స్పందించి జన్నేపల్లి వాగు బ్రిడ్జిపై సీసీ రోడ్డు ఏర్పాటును పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత రోడ్డు బ్రిడ్జి ఆర్మూర్ సబ్ డివిజన్ కిందికి వస్తుండడంతో ఆర్ అండ్ బీ ఆర్మూర్ డీఈఈ నాందేవ్‌ను ఫోన్‌లో వివరణ కోరడానికి ఆంధ్రజ్యోతి ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

లాలన వృద్ధాశ్రమ వ్యవస్థాపకుడు

గడ్డం రాజారెడ్డి మృతి



గడ్డం రాజారెడ్డి భౌతికకాయనికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వేముల

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు11: ప్రముఖ వ్యాపారవేత్త అంకాపూర్ లాలన ఆశ్రమ వ్యవస్థాపకుడు గడ్డం రాజారెడ్డి శనివారం రాత్రి మృతి చెందారు. గడ్డం రాజారెడ్డి ఆర్మూర్ ప్రాంత ప్రజలకు, జిల్లా వాసులకు పైపుల రాజారెడ్డిగా సూపరిచితుడు.ఎన్నో సేవ కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు అందించేవారు. గత 15ఏళ్ల క్రితం లాలన వృద్ధాశ్రమం స్థాపించి వృద్ధులకు భోజన వసతితో పాటు అన్ని సౌకర్యాలు కల్పించారు. ఆయన మృతి పట్ల ఆశ్రమంలోని వృద్ధులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆదివారం అంకాపూర్ గ్రామం లోని లాలన ఆశ్రమంలో అంత్యక్రియాలు నిర్వహించారు. అంతకు ముందు మా జీ మంత్రులు, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, డాక్టర్ భూపతి రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ పి.వినయ్‌రెడ్డితో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయ కులు, జిల్లా ప్రముఖులు రాజారెడ్డి భౌతికకా యాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి, ఎ మ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ గడ్డం రాజారెడ్డి సేవలు మరువలేని వన్నారు. వృద్ధాశ్రమం ఏర్పాటు చేసి ఎన్నో ఏళ్లుగా వృద్ధులకు ఉచితంగా ఆశ్రయం కల్పించారని, తమ ట్రస్ట్ ద్వారా ఎందరో పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు సహాయ సహకారాలు అందజేశారని గుర్తు చేశారు. అంత్యక్రియాల్లో అంకాపూర్ గ్రామస్థులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన పలువురు నాయకు లు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం నిధి సేకరణ



వరద బాధితుల కోసం నిధులు సేకరిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఆగస్టు11: ఇటీవల ప్రకృతి విపత్తుల వల్ల కేరళ రాష్ట్రంలోని వైనాడ్ ప్రాంతంలో అత్యధిక వర్షాల కారణంగా కొండచర్యలు విరిగిపడి వందలాది మంది చనిపోయ్యారని, వేలాది మంది నిరాశ్రయులు అయ్యారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్ గౌడ్ అన్నారు. ఆదివారం సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బోధన్ పట్టణంలో కేరళ వరద బాధితుల సహాయార్థం వ్యాపారస్తుల నుండి నిధి సేకరించడం జరిగిందన్నారు. వ్యాపారస్తులు తమవంతు సహకారంతో తోడ్పటు అందించి కొంత నగదు అందజేశారన్నారు. జమ అయిన డబ్బులను రాష్ట్ర కమిటీకి అందిస్తామని, కేరళ రాష్ట్రంలోని వైనాడ్ వరద బాధితుల సహాయార్థం ఇవి ఎంతగానో దోహదపడతాయన్నారు. మండలంలోని పెంటాఖుర్దు, సాలూర, సాలంపాడ్, కల్దుర్కి, రాంపూర్, బండారుపల్లి తదితర గ్రామాలలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో కేరళ రాష్ట్రంలోని వైనాడ్ వరద బాధితుల కోసం సహాయ నిధిని సేకరించారు. సీసీఎం పార్టీ బోధన్ కార్యదర్శి ఏశాల గంగాధర్ గ్రామాలలో వరద బాధితుల సహాయం కోసం నిధిని సేకరించామని అందించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు చాంద్, అంజని, రేఖ, శివలింగం రాములు, పోశవ్వ, నాగమణి, శేషబాయి, గైని రాములు, రాంపటేల్, సాయినాథ్, చింటు, ఎల్లయ్య, పోచవ్వ, భూమవ్వ, సావిత్రి, మహిపాల్, భూమవ్వ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట రక్షణకు రైతుల యత్నాలు



వేల్పూర్‌లో మొక్కజొన్న పంట చుట్టు వైర్లు చుట్టిన దృశ్యం



పచ్చలనడ్కుడలో మొక్కజొన్న పంట చుట్టు కట్టిన పాత చీరలు

వేల్పూర్, ఆగస్టు11: పంట విత్తనం నాటి నుంచి చేతికందే వరకు రైతులు అష్టకష్టాలు పడుతుంటారు. మండలంలోని పలు గ్రామాలలో ప్రస్తుతం అడవి పందుల బారి నుంచి మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు రైతులు పలు విధాల సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేస్తున్న మొక్కజొన్న పంటపై అడవి పందుల బెడద ఎక్కువ ఉన్న వాటి బారి నుంచి పంటను రక్షించుకోవడానికి పాత చీరులు, వైరు తీగెలు, ప్లాస్టిక్ తీగలు, పగ్గాలను పంట చుట్టు ఏర్పాటు చేస్తున్నారు. ఈ రక్షణ చర్యలు చేపట్టడం వల్ల అడవి పందుల బెడద తగ్గే అవకాశం ఉందంటున్నారు రైతులు. అడవి పందులు రాత్రి వేళల్లో పంటపై దాడి చేసే సమయంలో చీరలు, వైర్లు, నైలాన్ పగ్గాల స్పర్శ తగిలి వ్యక్తులు ఉన్నట్టుగా భావించి భయాందోళనతో అడవి పందులు పంటలోకి రాకుండా ఉంటాయని రైతులు బావిస్తున్నారు.. రైతులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పంట రక్షణ చర్యల వల్ల అడవి పందులు పంట లోపలికి ప్రవేశించకుంటా ఇలాంటి చర్యలు చేపట్టడం వల్ల పంట నష్టం జరగదని రైతులు భావిస్తున్నారు.

కుంగిన సిమెంట్ రోడ్డుకు మరమ్మతులు కరువు



సిమెంట్ రోడ్డుపైన ఏర్పడిన పగులను చూపుతున్న కాలనీవాసులు

మోస్రా,ఆగస్టు11: మండల కేంద్రంలో పలు కాలనీలలో సిమెంట్ రోడ్డు పరిస్థితి దుర్భరం ప్రభుత్వం లక్షలు పెట్టి రోడ్డు వేయమని నిధులు మంజూరు చేసి కాంట్రాక్టు ఇస్తే సదరు కాంట్రాక్టర్ రోడ్డు మాత్రమే వేసి రోడ్డు కుంగిపోకుండా రోడ్డుకు ఇరువైపులా మొరం మట్టి వేయకుండా వదిలేయడంతో రోడ్డు పొడవునా పగుళ్లు వచ్చి రోడ్డు వేసి కనీసం సంవత్సరం గడవకముందే కుంగిపోయి పగిలి ఏర్పడంతో కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు.మరో చోట రోడ్డు పొడవున దాదాపు పది మీటర్ల పొడవు పగిలిపోయిన దృశ్యం చూడవచ్చు. రోడ్డు వేసి పక్కన కాలనీ ఇళ్లలోకి చిన్నపిల్లలు, ముసలి వయసు ఉన్నవారు వెళ్లేందుకు చాలా ఇబ్బంది ఉంది రాత్రివేళల్లో ఈ రోడ్డు వెంబడి వెళ్తుంటే చాల సార్లు ఆ సిమెంట్ పగుళ్లలో కాలు, మోటారు వాహనాల టైర్లు ఇరుకుని పడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఉన్నతాధికారులకు విన్నవించిన ఫలితం లేక పోయింది. ఇంత దీనస్థితిలో బతుకుతున్న సంబంధించిన అధికారులు మొరం మట్టి కూడా వేయించలేక పోతున్నారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారి ఏఈకి వివరణ అడిగి నాడు ప్రచురించిన వార్తలో పగుళ్లు కేవలం ఎయిర్ క్రాక్ అని బదులిచ్చారు. ఇప్పుడు రోడ్డు పూర్తిగా ధ్వంసం అవుతున్న మరి ఇప్పుడు అయినా పట్టించుకుంటారా అని ఎదురుచూస్తున్న కాలనీవాసులు మండలంలో విచ్చలవిడిగా మొరం తవ్వకాలు జరుగుతున్న మా పరిధిలోకి రాదన్నారు. రెవెన్యూ అధికారులు కనీసం గ్రామాభివృద్ధిలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా మొరం మట్టివేస్తే బాగుంటుందని గ్రామస్థులు అభిప్రాయం.

త్వరలో పని పూర్తి చేస్తాం

● మండల ప్రత్యేక అధికారి రమేష్

రోడ్డుకు ఇరువైపులా మట్టివేయక రోడ్డు ధ్వంసం అవుతున్నాయి నిజమే. సదరు కాంట్రాక్టు పీఆర్‌ఏఈలతో మాట్లాడి పని పూర్తి చేయిస్తాం.

మొరం వేస్తే నడవడానికి వీలుంటది

రోడ్డు పక్కన మట్టి వేయక రోడ్డు ఎత్తు పెరిగి కిందకి దిగలేక రోడ్డు ఎక్కలేక ఇబ్బంది పడుతున్నాం. మట్టి వేయక రోడ్డు మొత్తం పగిలిపోయింది. సంబంధిత అధికారులు రోడ్డు మరమ్మత్తులు చేయండి.

- లక్ష్మీ, కాలనీవాసి

20వ వార్డులో పార్కు మాయం

● కబ్జాకు గురవుతున్న పార్కు స్థలం



పార్కులో ఇంటి నిర్మాణాన్ని చేపడుతున్న దృశ్యం

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు11: పట్టణంలోని 20వ వార్డులో వెంకటేశ్వర ఆలయం (కుక్కలగుట్ట) వెనుక గల పార్కు మయమైంది. గత ప్రభుత్వ పాలనలో లక్షలు ఖర్చు చేసి పది శాతం స్థలాల్లో పార్కును ఏర్పాటు చేసి మొక్కలను నాటారు. కానీ కొందరు కబ్జాదారులు అట్టి స్థలాన్ని కబ్జా చేయాలనే ఉద్దేశంతో అందులోని మొక్కలను తొలగించి కనబడకుండా చేశారు. పట్టణ ప్రగతిలో భాగంగా పది శాతం స్థలానికి పెన్సింగ్ చేసి బోర్డును ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం బోర్డు చినిగిపోగా పెన్సింగ్ కనబడడంలేదు. పార్కు పక్కనే నిర్మితమవుతున్న గృహానికి సంబంధించిన ఇసుక, సలకలు అందులోనే ఉన్నాయి. ఇంత జరుగుతున్న మున్సిపల్ అధికారులు నిమ్మకు నిరెత్తినట్టు వ్యవహారిస్తూ ఒక్కసారైన పర్యవేక్షించిన దాఖలాలు లేవు. దీంతో అధికారుల కనుసన్నల్లో కబ్జాకు గురవుతుందని కాలనీ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులు వస్తే తప్ప మున్సిపల్ అధికారులు స్పందించపోవడం సిగ్గుచేటని, ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉందని ప్రజలు గుర్తు చేస్తున్నారు. ఇప్పటికైనా ఇట్టి స్థలాన్ని కబ్జాకు గురికాకుండా మొక్కలను తొలగించి స్థలాన్ని ఉపయోగించుకుంటున్న కబ్జాదారుల నుంచి కాపాడి వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



సమావేశంలో పాల్గొన్న ఏఐటీయూసీ సభ్యుడు

పెర్కిట్, ఆగస్టు11: ఆటోడ్రైవర్‌లకు సంవత్సరానికి రూ.12వేలు ఇచ్చి ఆదుకుంటామని చెప్పిన రాష్ట్రప్రభుత్వం హామీలు అమలు చేయడంలేదని, తక్షణమే ఆటోడ్రైవర్‌లు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. ఆదివారం ఆర్మూర్ పట్టణంలోని మిలాన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆటోడ్రైవర్‌లు, ఏఐటీయూసీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి ఇద్దరు చొప్పున 60 మందితో ఆర్మూర్ డివిజన్‌లో నూతన కమిటీతో పాటు 20మంది యాక్షన్ కమిటీని ఎన్నుకుంటామని అన్నారు. ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని, లేని యెడల ఉద్యమం తీవ్రతరం చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి ఆరేపల్లిసాయిలు,సభ్యులు సుబాష్, శ్రీనివాస్, గురువయ్య, రమేష్, రాజేశ్వర్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠధామంలో సౌకర్యాలు కరువు



చీకట్లో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎడపల్లి, ఆగష్టు11: ఎడపల్లి మండలంలోని ఠాణాకలాన్ గ్రామంలో శనివారం రాత్రి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మృతిచెందగా అతని అంత్యక్రియలు అంధకారం నడుమ కొనసాగాయి. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎన్నో లక్షలు వెచ్చించి వైకుంఠధామాలు నిర్మిస్తే అవి నేటికీ కనీస మౌళిక సదుపాయాలకు నోచుకోక పోతున్నాయి. అందుకు నిదర్శనం ఠాణాకలాన్ గ్రామంలో శనివారం రాత్రి చీకట్లో జరిగిన అంత్యక్రియలే సాక్ష్యం. గ్రామానికి చెందిన ఇందూరి గణపతి(55) శనివారం మధ్యాహ్నం సమయంలో అలీసాగర్ శివారు ప్రాంతంలో అకస్మాత్తుగా గుండుపోటుతో మృతి చెందాడు. అయితే అతని అంత్యక్రియలు కుటుంబ సభ్యులు అదే రోజు నిర్వహించారు. ఇందులో భాగంగా రాత్రివేళ అడవి ప్రాంతంలో ఉన్న వైకుంఠధామంలో చిమ్మ చీకట్లో అంత్యక్రియలు నిర్వహించారు. లక్షలు వెచ్చించి వైకుంఠ ధామాలు నిర్మించి విద్యుత్తు సరఫరా ఏర్పాటు చేయక పోవడంతో చీకట్లోనే భయంతో అంత్యక్రియలు చేయాల్సి వచ్చింది. వైకుంఠధామంలో మౌళిక వసతులు కల్పించకుండా నిధులు దుర్వినియోగం చేశారని ఇప్పటికైనా అధికారులు స్పందించి వైకుంఠధామంలో సదుపాయాలు కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

● రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకటేష్



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకటేష్

జక్రాన్‌పల్లి, ఆగస్టు11: అప్పుల బాధతో ఆత్మహత్య చేస్తున్న జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ గ్రామానికి చెందిన రైతు కుంట రాజేష్ కుటుంబానికి న్యాయం జరగకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. ఆదివారం అర్గుల్‌లో రైతు రాజేష్ కుటుంబాన్ని పరామర్శించారు. అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చి అప్పులు చెల్లించాలని కుంట రాజేష్‌ను ఇబ్బందులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు కుటుంబానికి ప్రభుత్వ రైతు బీమా ఇవ్వాలన్నారు. వ్యవసాయం, ఇటుక బట్టీలు పెట్టిన సహకరించలేదని అప్పులు పాలయ్యారని అన్నారు. ప్రభుత్వం రైతు కుంట రాజేష్ కుటుంబాన్ని రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భూమన్న, నాయకులు ఎర్రన్న, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

పేకాట ఆడితే కఠిన చర్యలు : ఎస్సై

బోధన్‌రూరల్,ఆగస్టు11: పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని బోధన్ రూరల్ ఎస్ఐ నాగనాథ్ అన్నారు. ఆదివారం బోధన్ మండలంలోని చిన్న మావంది గ్రామంలో రహస్య ప్రదేశంలో పేకాట ఆడుతున్న ఏడుగురికి అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1200 స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రజలు పేకాట ఆడి చెడు వ్యసనాలకు లోనై డబ్బులు పోగొట్టుకోవద్దన్నారు. పేకాట ఆడిన, నిర్వహించిన, పేకాట ఏర్పాటు చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆసుపత్రిలో సిబ్బంది కొరత

- పెద్దకొడప్‌గల్‌లో రోగులకు ఇబ్బందులు
- పలు కీలక పోస్టులు ఖాళీ
- ఉన్న సిబ్బందికి పనిభారం
- దూర్రపాంతాల గ్రామీణ ప్రజలకు అందని వైద సేవలు
- వెంటనే సిబ్బందిని నియమించాలని రోగుల బంధువుల వినతి


ఆసుపత్రి బయట వేచిచూస్తున్న రోగులు (ఫైల్)

పెద్దకొడప్‌గల్, ఆగస్టు 11 : పేద ప్రజలకు అనారోగ్యం వస్తే చికిత్స కోసం సర్కార్ దవాఖానాకు పరుగుపెడుతారు. ప్రయివేట్ ఆసుపత్రికి వెళితే ఆర్థికంగా ఇబ్బంది అవుతుందనే ఉద్దేశంతో ఏ చిన్నపాటి అనారోగ్యానికి గురైనా సర్కార్ దవఖానాకే పరుగు పెడుతుంటారు. అయితే ఆ సర్కార్ దవాఖానాలో సిబ్బంది లేకపోతే రోగులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి. పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల ప్రజల అవసరాలకు గాను పెద్దకొడప్‌గల్ మండల కేం ద్రంలో ప్రభుత్వం సర్కార్ దవాఖానాను ఏర్పాటు చేసింది. ఆసుపత్రిని అధికా రులు ఏర్పాటు చేసిన మాట వాస్తవమే కానీ ఈ ఆసుపత్రిలో సిబ్బంది లేకపోవడంతో ఆసుపత్రికి వచ్చిన రోగులు ఇబ్బందులు ఎదు ర్కొంటు న్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన డాక్టర్‌ను వేరే ప్రాంతానికి పంపించ గా గతంలో ఫార్మాసిస్ట్‌గా పనిచేసిన అతనే రోగులకు చికిత్సలు అందిం చేవారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా ఈ ఆసుపత్రికి పేరు ఉన్న సిబ్బం ది సరిపడ లేకపోవడంతో రోగులకు సరియైన వైద్యం అందడం లేదన్న విమర్శలు వినబడుతున్నాయి. ఇటీవల జరిగిన ఉద్యోగులు సాధా రణ బదిలీల్లో భాగంగా ఈ ఆసుపత్రి నుంచి కొంతమంది సిబ్బంది బది లీపై వెళ్లారు. ఫార్మాసిస్ట్ బదులుగా మరొకరు రాగా ఇతర పోస్టులు అలాగే ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వ్యాపిస్తుం డడంతో ప్రతి నిత్యం రోగులు ఆసుపత్రికి వస్తున్నారు. అయితే ఆసుపత్రికి వచ్చిన వారికి చికిత్స లభించాలంటే గగనమే అవుతుందని రోగులు వాపోతు న్నారు. శనివారం కూడా ఈ ఆసుపత్రికి మండలంలోని వివిధ గ్రామా లకు చెందిన రోగులు చికిత్సనిమిత్తం రాగా సిబ్బంది ఎవరూ లేకపో వడంతో తాత్కాలికంగా ఇతర ఆసుపత్రికి చెందిన స్టాఫ్‌నర్స్‌ను పెద్దకొడ ప్‌గల్ పంపించారు. స్టాఫ్‌నర్స్ రోగులకు చికిత్స అందించారు. ఇక ఈ ఆసుపత్రికి వేరే మండలం నుంచి వైద్యాధికారిని జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు పంపగా తాను రెండో శనివారం ఉన్న కారణంతో ఆసుపత్రి విధులకు హాజరు కాలేదు. దీంతో ఉదయం నుంచి సాయం త్రం వరకు స్టాఫ్‌నర్స్ ఒక్కరే రోగులకు చికిత్సలు అందించి పంపించివేశారు. పరిస్థితి ఇలాగే కొసాగితే ప్రభుత్వం ఆసుపత్రుల మీద ప్రజ లకు నమ్మకం పోతుందని సర్కార్ దవాఖానాలో సిబ్బందిని నియమించి రోగులకు సకాలంలో చికిత్సలు అందేలా అధికారులు చర్యలు తీసుకో వాలని మండల ప్రజలు కోరుతున్నారు.

దోమకొండలో జెండాల పంపిణీ


ఇంటింటికి జెండాలను పంచుతున్న ఎమ్మెల్యే రమణారెడ్డి

దోమకొండ, ఆగస్టు 11: మండల కేంద్రంలోని అంగడి బజార్ రోడ్డులో ఆదివారం రెడ్డి సంఘం నూతన భవనాన్ని ఆదివారం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆగస్టు 15 సందర్భంగా తిరంగా యాత్ర కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెడ్డి సంఘం నిర్మాణానికి తన స్వంత నిధులు ఇచ్చిన సందర్భంగా కులస్థుల ఆహ్వానం మేరకు భవనాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. తిరంగాయాత్ర కార్యక్రమంలో భాగంగా ఇంటి పైన జెండాను ఆవిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మద్దూరి భూపాల్‌రెడ్డి, కల్పన, లక్ష్మారెడ్డి, నరేందర్‌రెడ్డి, మనోజ్,నంతోష్‌రెడ్డి, పున్న లక్ష్మణ్, జగదీష్, రవిందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, ఎస్‌స్‌పాల్‌రెడ్డి, రమేష్, రవి, నారాయణ,లక్ష్మణ్, తెల్ల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

మినీ వాటర్ ట్యాంకు ఏర్పాటు


బీర్కూర్ గై పర్లీ వద్ద ఏర్పాటు చేసిన మినీట్యాంకు

బీర్కూర్, ఆగస్టు 11 : బీర్కూర్ సమీపంలోని గై పీర్ల వద్ద మినీ వాటర్ ట్యాంకును ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆదివారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. గై పీర్ల వద్ద తాగునీటి వసతి లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. అనంతరం దాతల సహకారంతో మినీవాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్ర మంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు


డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు చేస్తున్న ఏఎస్సై

దోమకొండ, ఆగస్టు 11:వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని ఎస్సై ఆంజనేయులు అన్నారు. ఆదివారం దోమకొండ- సంగమేశ్వర్ రోడ్డులో వాహనాల తనిఖీ నిర్వహించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తులకు, నిబంధనలు పాటించని వారికి జరిమాన విధించారు. కార్యక్రమంలో ఏఎస్సై సుబ్రహ్మణ్యచారీ, పీసీలు చంద్రకాంత్,వెంకటేశ్వర్లున్నారు.

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


కొచ్చెరి మైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నసురుల్లాబాద్, ఆగస్టు 11 : నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామ శివారులో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహ పంక్తి భోజనాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

బీర్కూర్‌లో ఘనంగా గంప జాతర

బీర్కూర్, ఆగస్టు 11 : మండల కేంద్రంలో ఆదివారం గంప జాతర నిర్వహించారు. ఈ జాతరలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తి శ్రద్ధలతో భక్తులు ప్రసాదాలు, నైవేద్యాలు దేవుళ్ళకు సమర్పించారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సమావేశం


ఉపాధిహామీపై సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

బిచ్కుంద , ఆగస్టు 11 : బిచ్కుంద గ్రామపంచాయతీలో ఆదివారం గ్రామసభను నిర్వహించారు. ఈ సభలో ఉపాధి హామీ పనులపై సర్వే నివేదికను వెల్లడించారు. కాలువల పూడికలు , నర్సరీలో మొక్కల పెంపకం మొత్తం 23 రకాల పనులకు గాను 11లక్షల 51 వేల 955 రూపాయలు అవగా కొంతమంది కూలీలకు డబ్బులు రాలేదని సమావేశంలో తెలిపారు. పని చేసిన కూలీలకు మిగిలిన డబ్బులు వచ్చే విధంగా ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని, కూలీల ఖాతాలో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధిహామి సర్వే అధికారులు రంజిత్ , శివకృష్ణ , పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, తదితరులున్నారు.

వర్గీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

- జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు


విజయోత్సవ సభలో మాట్లాడుతున్న జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

బిచ్కుంద , ఆగస్టు 11 : సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉందని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన మాదిగ దండోరా విజయోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో అమలుకు తామే ముందు ఉంటామని ప్రకటించడం జరిగిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు అంశాలను అధ్యయనం చేసేందుకు కమిటీ ఏర్పాటుకు ఆదేశించి వారి నివేదిక ఆధారంగా త్వరలోనే తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు అవుతుందన్నారు. మూడుదశాబ్దాలుగా మందకృష్ణ మాదిగ వర్గీకరణ కోసం పదవులు ఆశించకుండా నిస్వార్థంతో అలుపెరగకుండా పోరాటం చేశారన్నారు. అనంతరం ఎంపీ సురేష్ షెట్కార్ మాట్లాడుతూ అన్ని రాష్ట్రాలలో ఎస్సీ వర్గీకరణ అమలు అయ్యేంతవరకు ఐకమత్యంగా ఉండాలని , పార్లమెంటులో బిల్లుకు కాంగ్రెస్ ఎంపీలంతా పట్టుబట్టి ఆమోదించేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జునప్ప షెట్కార్ , విఠల్‌రెడ్డి , గంగాధర్ , నౌషానాయక్ , మాదిగ దండోరా జిల్లా , నియోజకవర్గ , మండలాల నాయకులు , సభ్యులు తదితరులున్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

దోమకొండ, ఆగస్టు 11: మండల కేంద్రంలోని ఫైడిమర్రి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం 1973-74 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. 50 సంవత్సరాల క్రితం కలసి చదువుకున్న పూర్వవిద్యార్థులు గోల్డెన్ జూబ్లీ సెలబ్రెషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను నేమరు వేసుకుని సంతోషం వ్యక్తం చేశారు. పిల్లలు, మనుమలు, మనుమరాళ్లతో ఉదయం నుంచి సాయంత్రం వరకు గడిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ జీవితంలో ఎన్నో ఒడుదొడుగులు చూసామని, ప్రస్తుతం ఉన్నత స్థాయిలో ఉన్నామని అలాంటి తాము ఒకే వేదికపై 50 సంవత్సరాల తర్వాత కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యుడు దేవేందర్‌రావు, లాయర్ సుంచు గోవర్ధన్,రాంలు, మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, బాల్‌రెడ్డి, బాల్‌రాజు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుదాం


కస్తూరిబా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న సభ్యులు

పెద్దకొడప్‌గల్, ఆగస్టు 11: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు విధిగా మొక్కలు నాటాలని ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అయ్యల సంతోష్ పిలుపునిచ్చారు. ఆదివారం జుక్కల్ మండలం బస్వాపూర్ శివారులోగల కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో తమ ఫౌండేషన్ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అయ్యల సంతోష్ మాట్లాడుతూ మారుతున్న కాలం అనుగుణంగా అటవీ సంపద పెరిగాలే తప్ప మావన తప్పిదం వలన అడవులు తగ్గి పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. పర్యావరణం బాగుపడాలంటే ప్రతిఒక్కరూ తమ వంతు విధిగా మొక్కలు నాటాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం కూడా పర్యావరణాన్ని సంరక్షించే కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛదనం- పచ్చదనం పేరిట మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది ఇందులో ప్రతి వారు భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. తాము కూడా పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాలలో మొక్కలు నాటుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఆర్ ఫౌండేషన్ మండల అధ్యక్షులు సతీష్, ప్రధాన కార్యదర్శి గజానంద్, సభ్యులు సురేష్, శ్రీధర్, అంజూ, మనోజ్, సాయి, సంతోష్, బాలాజీ, సాయిలు పాల్గొన్నారు.

జనగామాలో రక్తదాన శిబిరం


జనగామాలో రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న నిర్వాహకులు

దోమకొండ, ఆగస్టు 11 : బీబీపేట మండలంలోని జనగామాలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ వ్యాపారవేత్త, విద్యావేత్త తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయన ఇంటి వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఆయన జన్మదినం సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన వ్యక్తులు ఇతరుల ప్రాణాలు కాపాడేందుకు రక్తదానం చేసేందుకు 70 మంది ముందుకు వచ్చి రక్తదానం చేసినట్లు తెలిపారు. ఉదయం నుంచి రక్తదాన శిబిరం ప్రారంభించారు. కార్యక్రమంలో తిమ్మయ్యగారి రజని, తీగల తిర్మల్‌గౌడ్, ఇంద్రసేనారెడ్డి, నాగరాజ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఆశోక్‌గౌడ్, మట్ట శ్రీనివాస్, సుమన్‌గౌడ్, సంజీవరెడ్డి, డి.వెంకట్‌రెడ్డి, ముదాం రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

కొండపై కూలిన గోడ


కూలిన కొండపై నిర్మించిన వాల్

బీర్కూర్, ఆగస్టు 11 : మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో శనివారం సాయంత్రం భక్తులకు పెద్దప్రమాదం తప్పింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. తెలంగాణ తిరుమల దేవస్థానంలో కొండ మధ్యభాగం ఫంక్షన్ హాల్ పక్క నుంచి కొండ పైభాగం వరకు సిమెంట్ కాంక్రిట్‌తో సైడ్ వాల్ నిర్మిస్తూ మట్టితో బరంతి నింపుతున్నారు. ఇలా సుమారు 17 ఫీట్ల ఎత్తువరకు వాల్ నిర్మించారు. మట్టితో బరంతి నింపారు. శ్రావణ శనివారం కావడంతో వేలాది మంది భక్తులు ఆలయానికి వచ్చి స్వామి వారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయంత్రం వరకు భక్తులు అందరూ వెళ్లిపోయారు. సరిగ్గా అదే సమయంలో 17 ఫీట్లఎత్తు నిర్మించిన వాల్ కుప్పకూలింది. ఫంక్షన్‌హాల్ పక్కనే కూలడంతో పెద్దప్రమాదం తప్పినట్లయింది. మధ్యాహ్నం వేళ కూలితే అన్నదానంలో పాల్గొన్న భక్తులపై కూలి పెద్దప్రమాదమే జరిగి ఉండేదని భక్తులు తెలిపారు. కొండపై వరకు సైడ్‌వాల్ నిర్మించి మట్టితో బరంతి నింపి గెస్ట్‌హౌస్ నిర్మించాలని తలంచారు. అయితే వర్షాల కారణంగా గుండు రాళ్ళు జారి వాల్‌పై పడడంతో వాల్ ధ్వం సమైందని కొందరు భక్తులు తెలిపారు. ఇదిలా ఉండగా వాల్‌నిర్మాణ పనులు నాసిరకంగా చేపట్టడం వల్లే ఇలా వాల్ కూలిపోయిందని పలువురు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మాల సంఘ నాయకుల రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న ఎస్సీ మాల సంఘం నాయకులు

నసురుల్లాబాద్, ఆగస్టు 11 : నసురుల్లాబాద్ మండల కేంద్రంలో ఆదివారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం నసురుల్లాబాద్ మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఎస్సీ పోరాట వ్యతిరేక సమితి నాయకులు ర్యాలీగా నసురుల్లాబాద్ రామాలయంకు, అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎస్సీ వర్గీకరణ పోరాట వ్యతిరేక సమితి నాయకుడు అడ్వకేట్ ఈశ్వర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, ఏడు మంది కమిటీ భారతదేశ రాజ్యాంగంలోని షెడ్యూల్ కులాలలో ఉన్న వారందరూ ఒకే వర్గానికి చెందిన వారు కాని వారు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఎస్సీ వర్గీకరణపై తీర్పు 341 అర్టికల్ విరుద్ధంగా తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బిల్లు పెట్టనివ్వకుండా అడ్డుకుంటామని, ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. రాజ్యాంగ నిబంధనలకు వ్యతిరేకంగా రిజర్వేషన్‌లకు వ్యతిరేకంగా తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నసురు ల్లాబా ద్ మండలంలోని అన్ని గ్రామాల మాలలు, పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడి మృతి

నిజాంసాగర్, ఆగస్టు 11 : మండలంలోని నర్సింగ్‌రావు పల్లి ఊర చెరువులో 24 సంవత్సరాల యువకుడు ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. గ్రామానికి చెందిన నంగి ప్రభాకర్ (24) గేదెలకు నీళ్ల తాగించడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో నుంచి మట్టిని తీయగా, ఆ గుంతలో యువకుడు పడి మృతిచెందాడు. గ్రామస్థులు నిజాంసాగర్ పోలీసులకు సమాచారం అందించగా, ఎస్సై సుధాకర్ హుటా హుటీన వెళ్లి ప్రభాకర్ మృతదేహాన్ని వెలికి తీశారు. తల్లిదండ్రులు బతువు దెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. నంగి ప్రభాకర్ మృతిచెందాడని గ్రామస్థులు సమాచారం అందించారు. తల్లిదండ్రులు పొద్దు పోయాక కూడా గ్రామానికి చేరుకోలేదు. పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు రాకపోవడంతో పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడకు తరలించక పోయారు. తల్లిదండ్రులు వచ్చి ఫిర్యాదు చేస్తేనే బాన్సువాడకు తరలిస్తామని ఎస్సై సుధాకర్ తెలిపారు. ప్రభాకర్ కుటుంబానికి దళితబంధు పథకం కింద మూడేసి యూనిట్లు మంజూరు కాగా, మంజూరైన యూనిట్లు సద్వినియోగం చేసుకోకుండా దుబారా చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలి

- ఎల్లారెడ్డి ఎస్సై మహేష్

ఎల్లారెడ్డి, ఆగస్టు 11 : సైబర్ నేరగాళ్ళ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎల్లారెడ్డి ఎస్సై మహేష్ అన్నారు. ఆదివారం సైబర్ నేరాల పట్ల ఓ వీడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హ్యాపీ ఇండిపెండెన్స్ డే అంటూ మెసెజ్‌లు మీకు రివార్డులు వచ్చాయని, ఫోన్ పే, గూగుల్ పే ద్వారా లింకులు పంపిస్తారని వాటిని ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయకూడదని గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా ఓటీపీలు, లింక్‌లు పంపితే స్పందించవద్దని సైబర్ నేరాల పట్ల ఏమైనా ఇబ్బందులు ఉంటే 1930 నెంబర్‌కు కాల్ చేయాలని లేదా సంబంధిత స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

నేడు హిందూ సంఘాల ఆధ్వర్యంలో బాన్సువాడ బంద్

బాన్సువాడటౌన్ , ఆగస్టు 11 : బంగ్లాదేశ్‌లో హిందూవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా హిందూ సంఘాల ఆధ్వర్యంలో బాన్సువాడ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు నాయకులు తెలిపారు. వ్యాపారులు, పాఠశాలల యాజమాన్యాలు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించాలని, సాయంత్రం 6 గంటలకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నట్లు, హిందులందరూ పెద్దసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- ఓసీ
దర్శన్	- శివంభజే
ప్రియా 70	- కల్కి
ప్రియా 35	- రాయన్, బడ్డీ

బాన్సువాడ

మహేశ్వరి	- భవనమ్
వెంకటేశ్వర	- తుఫాన్ (మార్నింగ్‌షో) కమిటీ కుర్రోళ్లు

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	230

